సాక్షి
తిరుపతి

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



ఆరోగ్యానికి 'సురక్ష'

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. వైద్య రంగంలో నూతన సంస్కరణలు తీసుకువస్తోంది. - 8లో



వైభవంగా పవిత్రోత్సవాలు

పవిత్రోత్సవాల్లో భాగంగా శ్రీ–కాళ–హస్తి. భరద్వాజ మహర్షికి విశేష అభిషేకాలు నిర్వహించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	35	25
చిత్తూరు	34	24
తిరుమల	29	21
గూడూరు	36	27
నగరి	35	25

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: వివిధ నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ వీ.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పీకేవీవై పథకంలో భాగంగా మూడు నెలల కాల వ్యవధి ఉన్న అసెంబ్లీ ఆపరేటర్ ఆర్‌ఏసీ, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుకు 15 నుంచి 45 ఏళ్ల వయసు లోపు ఉన్న నిరుద్యోగ యువత అర్హులని, ఆసక్తి గల వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్‌తో శిక్షణాధికారి ఏ.రాజును సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 85000 21856, 94908 06942 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

శ్రీవారి దర్శనానికి 3 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 72,137 మంది స్వామివారిని దర్శించుకోగా 23,735 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మేమొచ్చేశాం!

- పక్షుల కేంద్రం ఒకటి నుంచి ప్రారంభం




పక్షుల కేంద్రంలో విడిది చేస్తున్న నత్తగుల్లకొంగలు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రం అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్టు స్థానిక ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. విదేశీ వలస పక్షుల సీజన్ అక్టోబర్‌లో మొదలై ఏప్రిల్‌కు ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పక్షుల కేంద్రంలో నత్తగుల్లకొంగలు, నీటికాకులు, విజిలింగ్ డక్స్, స్వాతికొంగలు, పసువుల కొంగలు తదితరవి విచ్చేసి చెరువుల్లోని కడప చెట్లపై విడిది చేస్తున్నాయని తెలిపారు. ఇక గూడబాతులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇవే కాకుండా తెల్లకంకణాయిలు, తెడ్డుముక్కు కొంగలు విచ్చేసియాల్సి ఉందని రేంజర్ వెల్లడించారు.

3 నుంచి స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అక్టోబర్ 3వ తేదీన పాలిసెట్ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ అడ్మిషన్లకు పాలిసెట్ రాసి మొదటి, రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు రాని వారు, అలాగే పదో తరగతి ఉత్తీర్ణులై పాలిసెట్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోపు చేరదలచిన పాలిటెక్నిక్ కళాశాలల్లో దరఖాస్తులను అందించాలని ఆయన సూచించారు.

జాతర రెండో చాటింపు నేడు



వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి

వెంకటగిరిరూరల్: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి జాతరకు సంబంధించి బుధవారం రాత్రి రెండో చాటింపు వేయనున్నారు. తొలుత కాంపాలెంలోని గాలిగంగుల అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేసి కామాక్షమ్మ ఆలయం వద్ద చాటింపు వేస్తారు. అనంతరం పట్టణంలోని ప్రధాన మార్గం పాతకోట, పోలేరమ్మతల్లి, రాజా ప్యాలెస్ మీదుగా పాతశివాలయం వరకు చాటింపు నిర్వహిస్తారు. అక్టోబర్ 1న ఆదివారం ఘటోత్సవం, 4, 5 తేదీల్లో అమ్మవారి నిలుపు, నగరోత్సవం, నిమ్రజ్జనం జరగనుంది.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: వ్యవసాయ యంత్రాలను సరఫరా చేయడానికి ఆసక్తి గల వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలని జేసీ డీకే.బాలాజీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎర్రావారిపాళెం మండలంలోని ఉసికాయలపెంట, ఎల్లమంద గ్రామాలలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా చిరుధాన్యాలు, పప్పు దినుసులు, వేరుశనగ నూర్పిడి యంత్రాలను సరఫరా చేయడానికి ఆసక్తి గల డీలర్లు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

పవిత్రం..పునీతం

ఆహా.. ఇది కదా భాగ్యము.. శ్రీహరిని స్పృశించిన మలయ మారుతం మము తాకగా.. సుదర్శనుని అభిషేకించిన పవిత్ర తీర్థంలో పుణ్యస్నానమాచరింపగా.. ఉభయ దేవేరీ సమేతంగా కొలువు దీరిన మలయప్పస్వామిని సేవింపంగా.. మా జన్మ చరితార్థమైందని భక్తజనులు పరవశించారు. సుమనోహర విశేష సుమ మాలలు ధరించిన దేవదేవేరులను వీక్షించి పునీతులయ్యారు. బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేస్తూ నిర్వహించిన ధ్వజావరోహణ ఘట్టంలో పాలుపంచుకుని పులకించారు.

- శాస్త్రోక్తంగా శ్రీవారి చక్రస్నానం
- పుష్కరిణికి పోటెత్తిన భక్తజనం
- ఆగమోక్తంగా ధ్వజావరోహణం
- శ్రీవారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం చక్రస్నానం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీవారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అంతకుముందు తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు స్వామివారికి పల్లకీ ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య శ్రీ భూవరాహ స్వామి ఆలయ ముఖమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపనతిరుమంజనం జరిపించారు. విశేష అభిషేకాలనంతరం వివిధ పాశురాలను పెద్ద జీయ్యంగార్, చిన్న జీయ్యంగార్లు పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించారు. దీంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమైనట్టు టీటీడీ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమాలలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి దంపతులు, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జేఈఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఎస్పీ పరమేశ్వర రెడ్డి, సీవీఎస్వో నరసింహకిషోర్ తదితరులు పాల్గొన్నారు.





తిరుమల శ్రీవారి చక్రస్నానానికి హాజరైన అశేష భక్తజనం (ఇన్‌సెట్) సుదర్శన చక్రత్తాళ్వార్‌ను పవిత్ర జలాల్లో ముంచి లేపుతున్న అర్చకులు



చక్రస్నానంలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి



శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప



ధ్వజావరోహణం



స్నపన తిరుమంజనం

ముగిసిన తుమ్మలగుంట బ్రహ్మోత్సవాలు

- చక్రస్నానానికి భారీగా తరలి వచ్చిన భక్తులు
- ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం



ధ్వజావరోహణంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు



శ్రీవారితో పాటు శ్రీదేవి, భూదేవి, చక్రత్తాళ్వార్‌లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. చివరి రోజైన మంగళవారం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం 7 నుంచి 9గంటల మధ్య చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కంకణభట్టార్ గిరిధర్ భట్టాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, ముఖ ప్రక్షాళన, ధూప దీప నైవేద్యం, ఛత్ర చామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. పాలు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమోక్తంగా స్నపనం నిర్వహించారు. ఉపనిషత్తు మంత్రాలు, దశ శాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే వేదాలను టీటీడీ వేదపారాయణదారులు పారాయణం చేశారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరింపజేశారు. చివరగా పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం చేయించారు.

తరలివచ్చిన భక్తజనం

చక్రస్నాన ఘట్టాన్ని తిలకిచేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయ పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. స్నపన తిరుమంజన కైంకర్యాలు ముగిసిన తర్వాత వైఖానస ఆగమోక్తంగా స్వామివారి చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పుష్కరిణిలో పవిత్ర స్నానాలను ఆచరించారు. చక్రస్నానం సందర్భంగా పుష్కరిణిలో స్నానమాచరించడం ద్వారా సకల సుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

ధ్వజావరోహణం

సాయంత్రం 5.30 నుంచి 7 గంటల మధ్య జరిగిన ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది, వేద పాఠశాల పిల్లలు పాల్గొన్నారు.



చక్రస్నాన ఘట్టంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



చక్రత్తాళ్వార్‌కు చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అమెరికా యూనివర్సిటీతో ఒప్పందం


ఎంఓయూను చూపిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో అమెరికాలోని మసాచుసట్స్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఉన్నత విద్యకు సంబంధించి మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వర్చువల్ విధానంలో యూనివర్సిటీ ఆఫ్ మసాచుసట్స్ అసోసియేటెడ్ వైస్ చాన్స్‌లర్ టిస్‌ఫే మెరిస్సీ, ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్‌లో బీటెక్ చదివే విద్యార్థులు అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసే అవకాశం కలుగుతుందన్నారు. దీని ద్వారా ఐదేళ్లలోనే విద్యార్థులు బీటెక్‌తో పాటు ఎంఎస్ డిగ్రీ పూర్తి చేయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ వెండర్‌గెస్ట్, మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి సురక్ష

తిరుపతి జిల్లాలోని కుటుంబాలు	:	7,13,646
జనాభా	:	20,53,531
వలంటీర్ల సంఖ్య	:	12,357
ఇప్పటివరకు సర్వే నిర్వహించిన కుటుంబాలు	:	2,02,863
ఏఎన్‌ఎంల సంఖ్య	:	718
మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ల సంఖ్య	:	437
వైద్య బృందం సందర్శించిన కుటుంబాలు	:	1,35,765
సర్వే నిర్వహించిన వారి సంఖ్య	:	3,37,012
బీపీ పరీక్షలు చేయించుకున్న వారు	:	1,35,098
షుగర్ పరీక్షలు	:	1,20,661
ఇతర ప్రాథమిక పరీక్షలు	:	1,56,452


సీ.మల్లవరంలో పైలెట్ ప్రాజెక్ట్‌లో ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం

- ఇంటింటా వైద్య పరీక్షలు
- ముమ్మరంగా జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- 30 నుంచి జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. వైద్య రంగంలో నూతన సంస్కరణలు తీసుకువచ్చి పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. వైద్య రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని బలోపేతం చేశారు. సుమారు 4వేల వ్యాధులకు సంబంధించి, వెయ్యి రూపాయలకంటే ఎక్కువ ఖర్చు అయ్యే వైద్యాన్ని ఇందులో చేర్చారు. పొరుగు రాష్ట్రాలలోని కార్పొరేట్ ఆసుపత్రులల్లోనూ రాష్ట్ర ప్రజలు నాణ్యమైన వైద్యాన్ని పొందుతున్నారు. సీఎం మరో అడుగు ముందుకు వేసి ఇళ్ల ముంగిటకే వైద్యసేవలు అందించేందుకు 'ఫ్యామిలీ ఫిజీషియన్' విధానానికి పూనుకోవడం..ఇప్పటికే వైద్యులు ఈ కార్యక్రమంతో గ్రామాలబాట పట్టి, సేవలు అందిస్తుడడంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలానే వ్యాధి తీవ్రమై ఆసుపత్రులకు వచ్చే పరిస్థితి తలెత్తకుండా వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం అందించేలా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారు. ఏఎస్‌ఎంలు, వలంటీర్లు ఇంటింటా వెళ్లి ప్రతి కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్య వివరాలను సేకరించి, వారికి అవసరం బట్టి ప్రాథమిక వైద్య పరీక్షలతో పాటు, థైరాయిడ్, కొలస్ట్రాల్, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరోగ్యశ్రీ పథకం కింద మెరుగైన వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటారు.

ఈనెల 30 నుంచి శిబిరాలు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పటిష్ఠంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్య వివరాలపై సర్వే చేస్తున్నారు. ఈ నెల 30 నుంచి ప్రజారోగ్య వివరాల ఆధారంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమున్న వారికి నాణ్యమైన చికిత్సను అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రజల ఆరోగ్య వివరాల సేకరణ ఇలా...

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఇంటింటా వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు. ఎత్తు, బరువు నమోదు చేయడంతోపాటు ఆర్బీఎస్, మలేరియా, డెంగీ, టీబీ, హిమోగ్లోబిన్ వంటి ప్రాథమిక పరీక్షలను వారికి చేస్తున్నారు.

ఆరోగ్య వివరాల సేకరణ ఇలా

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఇంటింటా వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు. హైట్, వెయిట్, ఆర్బీఎస్, మలేరియా, డెంగ్యూ, టీబీ, హిమోగ్లోబిన్ వంటి ప్రాథమిక వివరాలు ఇంటింటా సేకరిస్తున్నారు.


33వ డివిజన్ మారుతీలో బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరాలను విజయవంతం చేయండి


జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ

చంద్రగిరి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను విజయవంతం చేయాలని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం, సీ.మల్లవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ట్రెల్‌యల్ రన్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోమిత్‌రెడ్డి.. మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ప్రజలకు అందరికీ ఆరోగ్య పరీక్షలు చేపట్టాలన్న ఆలోచన అమలుతోనే ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపుదిద్దుకుందన్నారు. ఈ కార్యక్రమం బాగుందని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారని తెలిపారు. సీ. మల్లవరంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ట్రయల్ రన్‌గా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 30 నుంచి నిర్వహించబోయే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాట్లు విధి విధానాల్ని పరిశీలించారు. కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఇంట్లోని వారి మొబైల్ ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేసి దాని వినియోగం తెలియజేయడంతో పాటు అక్కడే ఏడు రకాల పరీక్షలు చేసి ఆరోగ్య వివరాల రిపోర్టును మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారని చెప్పారు.


వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి జిల్లాలో మొదటి ట్రెల్ రన్

తిరుపతి జిల్లాలో సి.మల్లవరంలో వైద్య శిబిరాన్ని ట్రయల్ రన్‌గా చేపట్టినట్టు కలెక్టర్ తెలిపారు. ఉదయం నుంచి సుమారు 500 మంది ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నట్టు పేర్కొన్నారు. అంతకుముందు రాష్ట్ర ఎన్‌హెచ్ఆర్ఎం, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం ఆఫీసర్ రమాదేవి తదితర అధికారులు ఈ కార్యక్రమం అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌ఓ శ్రీహరి, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, డీఈఓ వీ.శేఖర్, డీపీఎంఓ శ్రీనివాసులు, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త రాజశేఖర్‌రెడ్డి, డీఐఓ శాంతకుమారి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారిణి సుశీలాదేవి, ఎంపీడీఓ వెంకటనారాయణ, సర్పంచ్ భారతి తదితరులు పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తిరుపతి రూరల్ మండలం సీ. మల్లవరంలో సోమవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో వైద్యబృందం ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి చంద్రగిరిలోని సెంట్రల్ ల్యాబ్‌కు తరలించింది. అలానే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అమరరాజా సంస్థ అవార్డులు

రేణిగుంట: దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లోని అసాధారణ రీతిలో రాణిస్తున్న పారిశ్రామికవేత్తలు, సంస్థలకు ×ది అమరరాజా బెటర్ వే అవార్డ్స్‌× పేరిట అవార్డులను ప్రదానం చేయనున్నట్లు అమరరాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ 38వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 20న ఈ ప్రతిష్టాత్మక అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. దేశంలో ప్రజల జీవన నాణ్యతను పెంపొందించడానికి మెరుగైన అవకాశాలు, నిబద్ధత అందించే సంస్థల నిర్మాణం కోసం ఈ అవార్డులు దోహదం చేస్తాయన్నారు. ఈ అవార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభించామని, అక్టోబర్31వ తేదీ లోపు అర్హులు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. డిసెంబర్ ఒకటిన విజేతలను ప్రకటించి, డిసెంబర్ 20న అమరరాజా కంపెనీ ప్రాంగణంలో అవార్డుల ప్రదానోత్సవం చేస్తామన్నారు.

అవార్డుల కేటగిరీలు:

- మహిళా ఉపాధి కోసం అమరరాజా బెటర్ వే అవార్డు
- గ్రామీణ ఆదాయ ఉత్పత్తికి అమరరాజా బెటర్ వే అవార్డు
- ఉత్తమ వ్యవసాయ ఆధారిత వ్యాపారానికి అమరరాజా బెటర్ వే అవార్డు

ఈ అవార్డులకు ఎంపికైన వారికి రూ. 3 లక్షలు నగదు బహుమతితోపాటు ఏడాదిపాటు వ్యాపారాభివృద్ధి, ఆర్థిక సప్‌లైన్స్, మానవ వనరులతో సహా సమగ్ర మెంటర్‌షిప్ ప్రోగ్రామ్‌నకు అర్హత పొందుతారని గల్లా జయదేవ్ తెలిపారు. అమరరాజా సంస్థల వెబ్‌సైట్ www. amararaja.com/ amararaja& awards లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

వైభవంగా పవిత్రోత్సవాలు


పూజాద్రవ్యాలను తీసుకెళుతున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు , అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండో రోజైన మంగళవారం పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పూజా ద్రవ్యాలను అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

వేగంగా భారత పర్యాటకరంగం పురోభివృద్ధి


విద్యార్థులతో ప్రిన్సిపల్ త్రిలోగచందర్

రేణిగుంట: భారతదేశ పర్యాటకరంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని తిరుపతి ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ ఎం.త్రిలోగచందర్ అన్నారు. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రేణిగుంట మండలం, కుర్రకాల్వ సమీపంలో ఉన్న ఇండియన్ కలినరీ(పాకశాస్త్ర) ఇన్‌స్టిట్యూట్‌లో తిరుపతి ప్రాంతానికి చెందిన వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ టూరిజం ఆర్గనైజేషన్ మార్గదర్శకాల మేరకు భారత పర్యాటక మంత్రిత్వశాఖ ×టూరిజం అండ్ గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్స్‌×ను ఈ ఏడాది థీమ్‌గా ఎంపిక చేసిందన్నారు. భావితరాల కోసం చెట్లను విరివిగా పెంచాలన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. భారత పాకశాస్త్ర సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

తిరుపతి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నోటిఫికేషన్ ఇవ్వాలని చెప్పారు. బుధవారం నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 10వ తేదీ ఇంటర్వ్యూలు, 11 సెలెక్షన్, 12న జాయినింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి


రోదిస్తున్న మృతుని భార్య

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): నిద్ర మత్తులో మురుగు కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. తొట్టంబేడు మండలం, దిగువసాంబయ్యపాళెంకు చెందిన మన్నసముద్రం చెల్లారెడ్డి, చెంచమ్మ భార్యాభర్తలు. వీరి కుమార్తె పోలమ్మకు సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. ఆమెకు తోడుగా ఉండడానికి తల్లిదండ్రులిద్దరూ ఆస్పత్రికి వచ్చారు. రాత్రి సమయంలో మగవారు మహిళా వార్డు వద్ద ఉండరాదని సిబ్బంది హెచ్చరించడంతో చెల్లారెడ్డి అక్కడి నుంచి వచ్చేశాడు. ఆస్పత్రి ముఖద్వారం వద్ద ఉన్న మురుగు కాలువ గట్టుపై పడుకుని నిద్రిస్తుండగా నిద్రమత్తులో కాలువలో పడి బురదలో కూరుకుపోయాడు. బంధువులు గమనించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతి భార్య, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికులను కలచివేసింది.

వీడ్కోలు వినాయకా!


తూపిలి పాళెం బీచ్‌లో గణనాథుడికి వీడ్కోలు పలుకుతున్న భక్తులు

వాకాడు: వినాయకుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని తూపిలిపాళెం బీచ్‌లో గత తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జనాల పర్వం మంగళవారంతో ముగిసింది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు వాహనాల్లో తరలివచ్చి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ ఏడాది దాదాపు 980 విగ్రహాలు నిమజ్జనం చేయగా.. 1.5 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు మత్స్యకారులు తెలిపారు. సీఐ హరికృష్ణ, ఎస్ఐ రఘునాథ్, కోస్టల్ సెక్యూరిటీ మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.


గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

హిందూ దేవాలయాలకు వెలుగు


శాసన సభలో మట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి: జగనన్న ప్రభుత్వంలో హిందూ దేవాలయలాకు నిజమైన వెలుగు వచ్చిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శాసన సభలో దేవాలయాల పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 3,000 దేవాలయాలు కట్టించాలని సంకల్పించిన చరిత్ర జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న గెలిచిన తర్వాత 4,750 దేవాలయాలకు రూ.28 కోట్లు ధూపదీప నైవేద్యాలకు అందించారని కొనియాడారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీటీడీ తరపున 66 రామాలయాలు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. అలాగే రూ.22 కోట్లతో కొండ చుట్టూ రోడ్డు ఏర్పాటు చేశారని చెప్పారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి నిత్యం 40 వేల మంది భక్తులు వస్తున్నారని, దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం శివం శివం రోడ్డుకు రూ.40 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన ఈశ్వర్, కిషోర్

తిరుపతి క్రైమ్: నగరంలోని రేణిగుంట రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. న్యూ మారుతీనగర్‌లో జీకే టెంపుల్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న గోపి కుమారుడు కిషోర్(27) మంచి చదువులు చదివాడు. అయినా ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెందాడు. రేణిగుంట రోడ్‌లోని ప్రైవేట్ హోటల్‌లో రూమ్ అద్దెకి తీసుకుని సోమవారం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

విషం తాగి ఆత్మహత్య

నగరంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. జయశాం థియేటర్ వీధిలో కే.ఈశ్వర్(45) అన్నపూర్ణ మెస్ నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంట్లో వారందరూ సొంత పనుల నిమిత్తం కర్నూలుకు వెళ్లడంతో ఇతను హోటల్‌లోనే ఉంటూ.. అక్కడే పడుకునేవాడు. ఈ క్రమంలో హోటల్‌లో నుంచి దుర్వాసన రావడంతో పోలీసులు తలుపులు పగలగొట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే మృతుడు కుమారుడు హరి తన తండ్రిని ఎవరో కొట్టి చంపారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం రిపోర్ట్ అనంతరం నిజాలు తేలనున్నాయని పోలీసులు తెలిపారు.